# పందెం

మూలం: ఆంటన్ చెకోవ్ · అనువాదం: కె. సదాశివరావు

**శిశిర** ఋతువులో ఒక చీకటి రాత్రి. పదిహేనేళ్ళనాడు ఆదేరోజున ఒక డిన్నర్ పార్టీని గురించి ఆలోచిస్తూ గదిలో మూలనుండి మూలకు పచారు చేస్తున్నాడొక వృద్ధ శ్రీమంతుడు. ఆనాటి పార్టీలో మంచి వాక్చాతుర్యం గల మేధావులెందరో వున్నారు. వారి సంభాషణల్లో దొర్లిన విషయాలలో ముఖ్యమైనది మరణశిక్ష! అతిథులలో చాలామంది-వారిలో పేరుమోసిన పండితులూ, పత్రికా విలేఖరులూ, రచయితలూ, ఫిలాసఫర్స్.. మరణశిక్షకు వారి వ్యతిరేకతను వెలిబుచ్చారు. శిక్షాస్మృతిగా మరణశిక్ష అతి పురాతనమూ, అనాగరికమైనదిగానూ, నాగరిక ప్రపంచానికి టొత్తిగా అనర్హం! పైగా అది అధర్మం! ప్రపంచవ్యాప్తంగా మరణశిక్ష స్థానంలో యావజ్జీవ కారాగార శిక్ష అమలుపరచడం న్యాయమని వారంతా అభిప్రాయపడ్డారు.

"మీతో నేను ఏకీభవించను" అన్నాడు శ్రీమంతుడు. నామట్టుకు నేను మరణశిక్షగానీ, యావజ్జీవ కారాగారశిక్ష గానీ అనుభవించలేదు. కాని న్యాయంగా చూస్తే నామట్టుకు మరణశిక్షే నీతిదాయకమనీ, దయాపూరితమనీ తోస్తున్నది. ఉరి క్షణంలో చంపేస్తుంది. యావజ్జీవ కారాగార శిక్ష క్షణక్షణమూ ప్రాణాలు తీస్తూ చంపుతుంది. ఏది దయాదాక్షిణ్యపూరిత మరణం? కొద్దిక్షణాలలో చంపడమా? లేక ఏళ్ళ తరబడి కొద్దికొద్దిగా ప్రాణాలు తీయడమా?"

"రెండూ అధర్మమే!" ఒక అతిథి అన్నాడు.

"ఎందుకంటే రెంటి లక్ష్యమూ ఒకటే-ప్రాణాన్ని తీయడం!' ప్రభుత్వం దేవుడు కాదు తలుచుకోగానే తాము తిరిగి పోయలేని ప్రాణాన్ని తీసే అధికారం ప్రభుత్వానికి వుండకూడదు"

అతిథులలో ఒక కుర్ర లాయర్ వున్నాడు. అతడి వయస్సు దాదాపు ఇరవై ఐదేళ్ళుంటుంది. అతడి అభిప్రాయాన్ని అడిగినప్పుడు అతడిలా అన్నాడు.

"మరణశిక్షా, యావజ్జీవ కారాగార శిక్షా రెండూ నా దృష్టిలో అధర్మమే! కాని వాటిలో నేను ఏదో ఒకదాన్ని కోరుకోవలసివస్తే నేను రెండో శిక్షనే కోరుకుంటాను. చావుకంటే ఎలాగో ఒకలా బ్రతకడమే మెరుగు."

అప్పుడు చర్చ మంచి ఆసక్తిదాయకంగా సాగింది. శ్రీమంతుడు ఆ రోజులలో యువకుడు. అసహనంతో చిరుకోపంతో పిడికిలితో బల్లమీద గుద్ది కుర్ర లాయర్‌తో అన్నాడు.

"అబద్ధం! మీరు ఐదేళ్ళు కూడా జైలులో వుండలేరని నేను ఇరవై లక్షలు పందెం వేస్తాను"

"మీరు సీరియస్‌గా మాట్లాడుతున్నారనుకుంటాను" అన్నాడు కుర్రలాయర్ తాపీగా. "అయితే నేనూ పందెం వేస్తాను. ఐదేళ్ళేం ఖర్మ! పదిహేనేళ్ళుంటాను"

"పదిహేనా? సరే!" అని దాదాపు అరిచాడు శ్రీమంతుడు.

"జెంటిల్‌మెన్! నేను ఇరవై లక్షల పణం పెడుతున్నాను."

"ఫ్రెండ్స్! నాకూ సమ్మతమే. మీ పందెం ఇరవై లక్షలూ, నా పందెం నా స్వేచ్ఛ!" అన్నాడు లాయర్.


ఆ విధంగా పరిహాసాస్పదమైన, అర్థరహితమైన పందెం వేయడం జరిగింది. ఆ రోజులలో శ్రీమంతుడు లెక్కపెట్టలేనన్ని లక్షల ఆస్తితో-పొగరుబోతుగా, ధీమాగా వుండేవాడు. అతడు ఈ పందెంతో ఆనందంలో తలమునకలై పోయాడు. భోజనం చేస్తున్నప్పుడు లాయర్‌తో హేళనగా అన్నాడు.

"చూడండి! మీరు కొంపలు మునగక ముందే విచక్షణతో ఆలోచించండి. ఇరవై లక్షలంటే నాకు చిల్లిగవ్వతో సమానం. కాని మీరు మీ జీవితంలో అందమైన మూడు నాలుగేళ్ళు అనవసరంగా పోగొట్టుకుంటారు. మూడు నాలుగేళ్ళే అంటున్నానెందుకంటే అంతకంటే మీరు భరించలేరు. మరో విషయం కూడా మరిచిపోకండి. స్వయంగా వేసుకున్న జైలుశిక్ష బలవంతంగా వేసిన దానికన్నా దుర్భరమైనది. మీ స్వేచ్ఛ మీ చేతిలో వున్నదన్న ఆలోచన ప్రతి క్షణమూ గుర్తుకొచ్చి జైలు గదిలమధ్య మీ జీవితాన్ని నరకప్రాయం చేస్తుంది. నాకు మీమీద జాలి వేస్తున్నది."

శ్రీమంతుడు ఇప్పుడు గదిలో పచార్లు చేస్తూ ఇదంతా జ్ఞప్తికి తెచ్చుకుని తనని లా ప్రశ్నించుకున్నాడు.

"నేనీ పందెం ఎందుకు వేశాను? దీని వల్ల ఏమి మంచి జరిగింది? లాయర్ తన జీవితంలో పదిహేనేళ్ళు వృధా చేసుకుంటాడు. నేనో ఇరవై లక్షలవతల పారేస్తాను. దీనివల్ల మరణశిక్ష కారాగారశిక్ష కన్నా మంచిదో కాదో ప్రజలకెలా తెలుస్తుంది. అర్థంగాదు! ఎన్నటికీ కాదు. అంతా నిరర్థకం, నిరుపయోగం. నా విషయంలో - ఇదంతా ధనమదంతో కూడిన చాపల్యం!! మరి లాయర్ విషయంలో? అది అంతులేని ధనలోభం!!

భోజనాల తర్వాత ఏమి జరిగిందో అతడికి జ్ఞప్తికి వచ్చింది. పందెం వేసినట్టుగానే లాయర్ తన ఏకాంత కారాగార శిక్షని శ్రీమంతుడి తోటలో వున్న ఒక చిన్న ఇంటిలో నిబంధనలకి అనుగుణంగా ఖచ్చితంగా అనుభవించాలని నిర్ణయించబడింది. నిర్బంధన కాలంలో ఇంటి గడప దాటరాదనీ, మనుష్యులను చూడరాదనీ, మానవ కంఠస్వరాలను వినరాదనీ, ఉత్తరాలనీ, వార్తాపత్రికలనీ చూడరాదనీ ఇరుపక్షాలూ ఒప్పుకున్నారు ఏదైనా ఒక సంగీత వాయిద్యం వుంచుకోవడానికీ, కావలసినన్ని పుస్తకాలు చదవడానికీ, ఉత్తరాలు వ్రాయడానికీ, తనివితీరా మద్యాలు త్రాగడానికీ, చుట్టలు కాల్చుకోవడానికీ అతడికి అనుమతి ఇవ్వబడింది. ఒప్పందం ప్రకారం నిశ్శబ్దంగా



ప్రత్యేకంగా కట్టబడిన చిన్న కిటికీ ద్వారా అతడు వుత్తరాలు వ్రాసి పంపించవచ్చు. తనకు కావలసిన భోజనం, వస్తువులు, పుస్తకాలూ, సంగీతం, మద్యం. ఒక చిన్న నోటు పంపిస్తే తనకు కావలసినవన్నీ పంపించబడతాయి అన్ని విషయాలతో జాగ్రత్తగా వ్రాయబడిన ఒప్పందం పకడ్బందీగా కారాగార వాసాన్ని కఠినంగా ఏకాంతంగా వుండేలా చేసింది. లాయర్ ఖచ్చితంగా పదిహేనేళ్ళు ఆ పరిస్థితిలో వుండాలి. ఒప్పందంలోని ఏ షరతుని ఉల్లంఘించినా, లేక పందెపు కాలానికి కనీసం రెండు నిముషాల ముందుగా పారిపోయినా శ్రీమంతుడు ఇరవై లక్షలివ్వాల్సిన అవసరం వుండదు.

చెరలోవున్న మొదటి సంవత్సరంలో లాయర్ అతడు పంపించిన చిన్న ఉత్తరాలనుబట్టి, వూహిస్తే భయంకరమైన ఒంటరితనంవల్ల బాధపడ్డాడని తోస్తుంది. అతడు నిర్బంధంలో వున్నవేపునుండి రాత్రింబవళ్లు పియానో సంగీతం వినిపించేది. అతడు మద్యాన్ని, పొగాకుని వద్దన్నాడు.

"మద్యం కోర్కెల్ని రేపుతుంది. ఖైదీకి కోరికలే ముఖ్యమైన శత్రువులు. అంతేకాకుండా మద్యాన్ని ఒంటరిగా త్రాగడంకన్నా తెలివితక్కువతనం వుండదు. పైగా పొగాకువల్ల ఈ గదంతా కంపుకొడుతున్నది" అంటూ అతడు వ్రాశాడు.

మొదటి సంవత్సరంలో తేలిగ్గా చదివేయగలిగిన నవలల్ని చాలా చిక్కులతో ఉక్కిరిబిక్కిరి చేసే ప్రేమకథల్ని-క్రైం కథల్ని, హాస్యకథల్ని లాయర్ కోసం పంపించారు.

రెండో సంవత్సరంలో పియానో వినిపించడం మానేసింది. లాయర్ మహాకావ్యాల్ని పంపించమని అడిగాడు. ఐదో ఏట మళ్ళీ సంగీతం మొదలైంది ఖైదీ మద్యం కావాలని అడిగాడు. ఆ ఏడంతా అతడు తిండి తింటూ తప్పత్రాగుతూ మంచం మీదే పడి వున్నాడని అన్నారు అతణ్ణి చూసినవారు. ఆరోజుల్లో అతడు మాటిమాటికి ఆవలిస్తూ వుండేవాడు. కోపంగా తనలోతనే మాట్లాడుకుంటూ వుండేవాడు. పుస్తకాల్ని చదవడం పూర్తిగా మానేశాడు. రాత్రివేళ కూర్చుని ఏదేదో వ్రాస్తుండేవాడు. శ్రమపడి ఎంతో సేపు వ్రాసిందంతా ఉదయాన చింపి పోగులు పెట్టేవాడు. ఎన్నోసార్లు అతడు ఏడుస్తుండగా వినివిస్తుండేది.

ఖైదీ ఆరో సంవత్సరం ఉత్తర భాగములో శ్రద్ధగా భాషల్ని, వేదాంతాన్ని, చరిత్రనీ అధ్యయనం చేయడం మొదలు పెట్టాడు. ఆకలిగొన్న వాడిలా ఈ విషయాల మీద పడేసరికి అతడికి కావలసిన పుస్తకాలు తెప్పించడానికి శ్రీమంతుడు చాల ఇబ్బంది పడవలసి వచ్చింది. ఆ తర్వాత నాలుగేళ్ళ వ్యవధిలో అతడి అవసరాలకి ఆరు వందలకి పైగా పుస్తకాలు కొనవలసి వచ్చింది.

దుర్గ ప్రకోపించిన ఆ రోజుల్లో ఖైదీ నుండి శ్రీమంతుడికో ఉత్తరము వచ్చింది.

"ప్రియమైన జైలర్!

నేను ఈ వాక్యాన్ని ఆరు భాషల్లో వ్రాస్తున్నాను. వాటిని నిపుణులకు చూపించండి. వారిని చదవమనండి. నేను వ్రాసిన దానిలో వారు ఒక్క తప్పు కూడ పట్టుకోలేక పోతే, దయయుంచి తోటలో తుపాకి కాల్చిన శబ్దం నాకు వినిపించేలా ఏర్పాటు చేయండి అన్ని దేశాల మహామహులూ వేరవేరుభాషల్లో మాట్లాడేవారే కాని వారందరిలోనూ జ్వలిస్తున్నది ఒక్కటే మంట, నేను దాన్ని అర్థం చేసుకొని అనుభవిస్తున్నాను. ఈ అతిలోక మహదానందాన్ని మీకర్థమయేలా ఎలా చెప్పడం??"

ఖైదీ కోరిక తీర్చబడింది. తోటలో రెండు సార్లు తుపాకి పేల్పించాడు శ్రీమంతుడు.

పదేళ్ళు గడిచాక టేబుల్ ముందు కదలకుండా కూర్చుని బైబుల్ మాత్రమే చదువుతూ వుండిపోయినాడు. శ్రీమంతుడికి ఆశ్చర్యం వేసింది. నాలుగేళ్ళలో ఆరు వందల మహా గ్రంథాల్ని క్షుణ్ణంగా చదివేసిన వాడు ఒకే ఒక పుస్తకంతోను అందునూ తేలికగా అర్థమయ్యే దానితో ఒక పూర్తి సంవత్సరం గడపడం ఏమిటా అని. తర్వాత బైబుల్ స్థానంలో మత చరిత్రలకి సంబంధించిన పుస్తకాలు, వేదాంత గ్రంథాలూ నచ్చేయి.

తన కారాగార వాసపు చివరి రెండేళ్ళలోఖైదీ అసాధారణమైనన్ని పుస్తకాలు, ఇష్టం వచ్చినట్లుగా చదివాడు. ఇప్పుడు జీవశాస్త్ర విషయాలని ఆసక్తితో చదివేవాడు, మరి కాసేపట్లో బైరన్, షేక్స్‌పియర్ చదివేవాడు. తనకి రసాయన శాస్త్ర గ్రంథాన్ని, వైద్య గ్రంథాన్నీ, ఒక నవలనీ, ఏదో ఒక తత్వ జ్ఞాన గ్రంథాన్నీ వేదాంత గ్రంథాల్నీ పంపించమని అతడి వద్ద నుండి చీటీలు వస్తూ ఉండేవి. ఆ పైన పగిలిపోయిన ముక్కలతో అల్లకల్లోలంగా వున్న సముద్రంలో ఈదుతున్న వాడిలా, మునిగి పోకుండా తనను తాను రక్షించుకొనడానికి, ఆత్రుతతో ఒక శకలం తర్వాత మరో దానిని అందుకొంటున్న వాడిలా అతడు చదువు సాగించాడు. (సశేషం)


100 ml బాటిలు కొని

87 పైసలు ఆదా చేసుకోండి

'త్రివేణి' ఇంకు

ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో
100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుతున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-20
(స్థానిక పన్నులు అదనం)
ఉపయోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.




తయారుచేయువారు :

కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ

751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081